సాక్షి
ఖమ్మం

శనివారం । 5 । ఆగస్టు । 2023



కొనలేం.. తినలేం..

వరదలతో పంట దెబ్బతినడంతో కూరగాయల ధరలు పెరగగా.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 8లో



పాలేరు రిజర్వాయర్ పరిశీలన

ఇటీవల భారీగా వరద చేరిన నేపథ్యాన పాలేరు రిజర్వాయర్‌ను నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ రమేష్‌బాబు పరిశీలించారు. 10లో



వాతావరణం

శనివారం జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఏసీబీ డీఎస్పీగా రమేష్



ఖమ్మంక్రైం: ఖమ్మం ఏసీబీ డీఎస్పీగా వై.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1995 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సైతం పనిచేశారు. అనంతరం పదోన్నతిపై డీఎస్పీగా నల్లగొండ జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఖమ్మం వచ్చారు. గతంలో ఇక్కడ ఏసీబీ డీఎస్పీగా ఉన్న సూర్యనారాయణ ఉద్యోగోన్నతిపై రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ అయిన విషయం విదితమే. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే 91543 88981 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

డయల్100కు 3,383 ఫోన్లు

ఖమ్మంక్రైం: ప్రజలు తమ ప్రాంతంలో జరిగిన నేరాలు, ఘటనలకు సంబంధించి సమాచారం ఇచ్చేందుకు ఏర్పాటుచేసిన డయల్ 100కు జూలైలో 3,383 మంది ఫోన్ చేశారని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఇందులో 87 ఘటనలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వెల్లడించారు. అయితే, కొందరికి అవగాహన లేకపోవడంతో అనవసర విషయాలకు కూడా ఫోన్ చేస్తున్నారని, అలాకాకుండా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100ను ఉపయోగించుకోవాలని సీపీ ఓ ప్రకటనలో సూచించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వృత్తి నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి పొందేలా సెట్‌కం సిబ్బంది మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, రిఫ్రిజిరేటర్, ఏసీ మెకానిజంలో ఇచ్చే శిక్షణ అనంతరం సెట్విన్ ద్వారా పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు విద్యార్హత, ఆధార్‌కార్డు, ఫొటో, కుల ధ్రువీకరణ పత్రంతో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాల కోసం 99482 07271 నంబర్‌లో సంప్రదించాలని డీవైఎస్‌ఓ సూచించారు.

డీసీఎస్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన పద్మజ



డీసీఎస్‌ఓ పద్మజకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి(డీసీఎస్‌ఓ)గా సి.పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆమె కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆతర్వాత పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు సురేందర్, నిస్సార్, వెంకటేశ్వర్లు తదితరులు పద్మజకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, రేషన్‌డీలర్ల సంఘం నాయకులు జానీమియా, ఇబ్రహీం, బాబు, నాగేశ్వరరావు తదితరులు కూడా డీసీఎస్‌ఓను కలిశారు.

నలుగురు ఎంపీడీఓలకు మళ్లీ బదిలీ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పది మంది ఎంపీడీఓలకు గత నెల 31వ తేదీన కలెక్టర్ బదిలీ చేయగా గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే, అందులో నలుగురిని మరో చోటకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలవరించారు. కాగా, ఈ ఉత్తర్వులు గతనెల 31వ తేదీతోనే వచ్చాయి. తాజాగా జరిగిన బదిలీల్లో తిరుమలాయపాలెం ఎంపీడీఓ బి.రవీందర్‌రెడ్డిని ఖమ్మం రూరల్‌కు, సీహెచ్.శ్రీనివాసరావును ఖమ్మం రూరల్ నుంచి తిరుమలాయపాలెంకు, బి.అశోక్‌ను ముదిగొండ నుంచి బోనకల్‌కు, విడివి అశోక్‌కుమార్‌ను బోనకల్ నుంచి ముదిగొండకు బదిలీ చేశారు.

10వరకు 'ఇన్నోవేటర్' దరఖాస్తులు స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: ఇంటింటా ఇన్నోవేటర్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఈనెల 10వ తేదీ వరకు ఉందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించిన వారు పూర్తి వివరాలు, ఫొటోలు, రెండు నిమిషాల వీడియోను 91006 78543 నంబర్‌కు వాట్సప్ ద్వారా పంపించాలని సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున వీటిని తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ) ద్వారా ప్రదర్శిస్తారని తెలిపారు.

బాధ్యత.. భరోసా!

శాఖల వారీగా వీఆర్‌ఏల కేటాయింపు

- జిల్లాలోని నాలుగు శాఖల్లో 672 పోస్టులు భర్తీ
- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం
- కలెక్టరేట్‌లో మొదలైన సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలన కోసం కలెక్టరేట్‌కు వచ్చిన వీఆర్‌ఏలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్(వీఆర్‌ఏ)లకు వివిధ శాఖల్లో పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఏళ్ల నాటి వారి కల నెరవేరినట్లయింది. పలు ప్రభుత్వ శాఖల్లో ఉన్న 672 పోస్టులు వీరితో భర్తీ చేయనున్నారు. 61 ఏళ్ల లోపు ఉన్న వీఆర్‌ఏలకు పోస్టింగ్ ఇవ్వనుండగా, 61ఏళ్లు దాటాక కూడా పనిచేస్తున్న వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులకు అవకాశం కల్పిస్తారు. కాగా, విద్యార్హతల ఆధారంగా రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల్లో విలీనం చేయడమే కాక శాఖల వారీగా కేటగిరీలు, వేతనాలు నిర్ణయించారు. ఈ విషయమై వీఆర్‌ఏలకు సమాచారం ఇవ్వడంతో వారు సర్టిఫికెట్ల పరిశీలన కోసం శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌కు బారులుదీరారు.

సర్వీస్ క్రమబద్ధీకరణ, పే స్కేల్

ఏళ్లుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్న వీఆర్‌ఏలను ప్రభుత్వంలో విలీనం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల నిర్ణయించారు. వీరి సర్వీసును క్రమబద్ధీకరించడంతోపాటు పేస్కేల్ కూడా వర్తింపచేస్తామని వెల్లడించారు. దీంతో వీరందరినీ కీలక శాఖల్లోకి తీసుకోనుండగా, శాఖలు, విద్యార్హత, పోస్ట్ ఆధారంగా పే స్కేల్ నిర్ణయించారు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ పొందిన వారికి రూ.24,280 నుంచి రూ.72,850 వరకు వేతనం అందనుంది. ఇదే శాఖలో రికార్డ్ అసిస్టెంట్(సూపర్ న్యూమమరీ)లకు రూ.22,240 నుంచి రూ.67,300, ఆఫీస్ సబార్డినేట్, చైన్‌మన్‌లకు రూ.19వేల నుంచి రూ.58,850 వరకు పే స్కేల్ నిర్ధారించారు. ఇక మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ కేటగిరీలో వార్డ్ ఆఫీసర్లకు రూ.24,280 నుంచి రూ.72,850, ఇరిగేషన్ శాఖలో లష్కర్, హెల్పర్లుకు రూ.19వేల నుంచి రూ.58,850, మిషన్ భగీరథ శాఖలో హెల్పర్(సూపర్ న్యూమరీ)లకు వేతనంగా రూ.19వేల నుంచి రూ.58,850 వరకు నిర్ణయించారు.

శాఖల వారీగా కేటాయింపులు ఇలా..

శాఖ	కేటగిరి	పోస్టులు
రెవెన్యూ	జూనియర్ అసిస్టెంట్	86
రెవెన్యూ	రికార్డ్ అసిస్టెంట్	46
రెవెన్యూ	చైన్‌మన్	08
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్	జూనియర్ అసిస్టెంట్	50
జలవనరులశాఖ	లష్కర్	255
జలవనరులశాఖ	హెల్పర్	107
మిషన్ భగీరథ	హెల్పర్	120
మొత్తం	-	672

జలవనరుల శాఖకే అత్యధికం

జిల్లాలోని 672 మంది వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో పోస్టింగ్ ఇవ్వనుండగా, ఒక్క జలవనరుల శాఖకే 362 మందిని కేటాయించారు. వీరిలో లష్కర్లుగా 255 మందికి, హెల్పర్లుగా 107 మందికి పోస్టింగ్ ఇస్తారు. ఇక మిషన్ భగీరథలో 120 మందిని హెల్పర్లుగా నియమించిన ప్రభుత్వం.. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా 86 మందిని భర్తీ చేయనుంది. కాగా, ప్రభుత్వం తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు పోస్టింగ్‌పై ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యాన వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా లింగరాజు, రమాదేవి, ఉపేంద్ర, విజేత తదితరులు కలెక్టర్ గౌతమ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

'లిఫ్ట్' ఇచ్చేదెన్నడు?!

- జిల్లాలో చతికిలపడిన ఎత్తిపోతల పథకాలు
- రెండొంతులకు పైగా లిఫ్ట్‌లది అదే పరిస్థితి..
- పూర్తి శిథిలావస్థలో 21 పథకాలు
- ఏళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో ప్రశ్నార్థకంగా ఆయకట్టు సాగు



గత ఏడాది వరదలతో దెబ్బతిన్న కామంచికల్ లిఫ్ట్ పంప్‌హౌస్

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు చతికిలపడ్డాయి. ఏటా అవసరమైన మరమ్మతులు చేస్తూ రైతు కమిటీల సహకారం, అధికారుల పర్యవేక్షణలో నడిపించాల్సిన పథకాలు ఎక్కడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. జిల్లాలో 135 ఎత్తిపోతల పథకాల పరిధిలో 46,909 ఎకరాల ఆయకట్టు సాగవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే, ఇందులో చాలావరకు ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు లేక మూలనపడ్డాయి. ఆయకట్టు రైతుల్లో సమన్వయం కొరవడటం, అధికారులు చొరవ తీసుకోకపోవడంతో పనిచేయని లిఫ్ట్‌ల సంఖ్య పెరుగుతోంది.

ప్రభుత్వం పట్టించుకుంటేనే..

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 135 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటిలో 21 పథకాలు పూర్తిగా శిథిలావస్థకు చేరగా.. మరమ్మతు చేసే అవకాశం లేదని అధికారులు తేల్చేశారు. వీటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సిందేనని జలవనరుల శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. గతంలో ఎలాంటి నీటి వనరులు లేని వ్యవసాయ భూములు బీళ్లుగా ఉండేవి. ఆతర్వాత ఎత్తిపోతల పథకాల నిర్మాణంతో అదనంగా ఆయకట్టు సాగులోకి రావడంతో రైతులు సంతోషపడినా వారి ఆనందం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ప్రధానంగా లిఫ్ట్‌ల పంప్ హౌస్‌లు, మోటార్లు, పైపులైన్లు మొరాయిస్తే సరిచేయడానికి రూ.లక్షల్లో ఖర్చవుతుంది. అంత డబ్బు వెచ్చించడం రైతులకు కష్టమే. గతంలో నీటి పారుదల శాఖలోని ఐడీసీ పేరిట ప్రత్యేక విభాగం ద్వారా లిఫ్ట్‌ల నిర్మాణం, పర్యవేక్షణ కొనసాగేది. ఐదేళ్ల క్రితం సాగునీటిలో ఉన్న శాఖలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చి జలవనరుల శాఖగా ఏర్పాటుచేశారు. అప్పటినుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పరిస్థితి మరింత దిగజారింది. ఈమేరకు ప్రభుత్వం స్పందించి ఎత్తిపోతల పథకాలు పూర్తిగా శిథిలమైపోక ముందే నిధులు కేటాయించి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు జరుగుతున్నాయి..



నిధులు మంజూరైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ల మరమ్మతులు చేపడుతున్నాం. కొన్నింటికి చిన్నచిన్న మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయి. ఇంకొన్ని మాత్రం పూర్తిగా శిథిలం కావడంతో కొత్తవి నిర్మించాల్సిందే. మరమ్మతుల కోసం 2021–22లో రూ 25లక్షలు, 2022–23లో రూ.12 లక్షలు, 2023–24లో రూ.24 లక్షల నిధులు మంజూరయ్యాయి.

– శంకర్‌నాయక్, సీఈ, జలవనరులశాఖ

కొత్తగా ఐదు లిఫ్ట్‌ల పనులు

పాత లిఫ్ట్‌ల పరిస్థితి ఇలా ఉంటే.. కొత్తగా జిల్లాకు మరో ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరయ్యాయి. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం నరసింహాపురం–1, 2 పనులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. కల్లూరు మండలం కొర్లగూడెంలో రూ.4.41 కోట్లతో, మధిర మండలం మహదేవపురంలో రూ.12.14 కోట్లతో, బోనకల్ మండలం రాపల్లెలో రూ 12.87 కోట్ల అంచనాలతో లిఫ్ట్‌లు మంజూరు కాగా, పనులు జరుగుతున్నాయి.

నియోజకవర్గాల వారీగా ఎత్తిపోతల పథకాలు ఇలా...

నియోజకవర్గం	మొత్తం	పని చేస్తున్నవి	మరమ్మతు చేయాల్సినవి	అసలే పనిచేయనివి
మధిర	49	15	17	19
సత్తుపల్లి	47	26	21	-
పాలేరు	20	12	8	-
వైరా	17	06	09	02
ఖమ్మం	02	01	01	-

మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల

తొలిరోజు రెండు దరఖాస్తులు



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు దరఖాస్తు అందజేస్తున్న వ్యాపారులు

ఖమ్మంక్రైం: జిల్లాలో 2023–25 ఏడాదికి గాను వైన్స్ కేటాయింపునకు టెండర్ నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి మాట్లాడారు. మొత్తం 122 షాపుల్లో గౌడ కులస్తులకు 18, ఎస్సీ 4, ఎస్టీలకు ఎనిమిది షాపులు రిజర్వ్ చేయగా, మిగతా 82 షాపులను జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు తెలిపారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం 21ఏళ్ల లోపు వారు, దోషులుగా నిర్ధారించబడిన వారు దరఖాస్తు చేయడానికి అర్హులు కారని చెప్పారు. అలాగే, గతంలో బకాయి ఉన్న వారు, ఐపీ పెట్టిన వారు కూడా అనర్హులని తెలిపారు. దరఖాస్తులు ఈనెల 18 వరకు స్వీకరించనుండగా, మధ్యలో 6, 13వ తేదీ ఆదివారాలు, 15న సెలవు ఉంటుందని చెప్పారు. మిగతా రోజుల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు, చివరిరోజు ఆరు గంటల వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మంతోపాటు హైదరాబాద్ నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ స్టేషన్ –1 సీఐ రాజు, టాస్క్‌ఫోర్స్ సీఐ విజయేందర్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి బోణీ

మొదటి రోజు నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చెరువుమాదారం షాపు నంబర్ 49, రాజేశ్వరపురంలోని 50వ నంబర్ షాపుకు ఒక్కో దరఖాస్తు వచ్చాయి. ఎక్సైజ్ స్టేషన్–1 కార్యాలయంలో ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1, 2, నేలకొండపల్లి, వైరా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని వైన్స్‌కు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారు. అలాగే, ఎక్సైజ్ స్టేషన్ వెనుకాల ఉన్న టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌లో మధిర, సింగరేణి మండలాలకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, గత ఏడాది 6,212 దరఖాస్తులు రాగా.. వీటి ద్వారా రూ.124 కోట్లు ఆదాయం సమకూరింది. ఈసారి సోమవారం నుంచి దరఖాస్తులు భారీగా వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

వచ్చేనెల 9న లోక్ అదాలత్

ఖమ్మంలీగల్: వచ్చేనెల 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని... ఇందులో రాజీ పడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారంపై న్యాయమూర్తులు దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం న్యాయమూర్తులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ కేసులు అధికసంఖ్యలో పరిష్కరించేలా ఇప్పటినుంచే పోలీస్ అధికారులతో సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. చెక్‌బౌన్స్, కుటుంబ తగాదా కేసులను కూడా అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు కె.దీప, టి.గోపికా నాగశ్రావ్య, వి.మాధవి, ఆర్.శాంతిలత పాల్గొన్నారు.

బీసీ భవన్ నిర్మాణ పనులు పూర్తిచేయండి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో బీసీ భవన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బైపాస్‌రోడ్డులో రూ.3.50 కోట్లతో నిర్మిస్తున్న బీసీ భవన్ నిర్మాణ పనులను సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా చూస్తూనే త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, మున్సిపల్ డీఈ రంగారావు, ఏఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ త్వరగా అందించాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని మిల్లర్లు ఎఫ్‌సీఐ అధికారులతో సమన్వయం చేసుకుంటూ లక్ష్యం మేరకు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) త్వరగా అందించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. మిల్లులను సామర్థ్యం మేరకు నడిపిస్తూ మిల్లింగ్‌లో పెంచాలని చెప్పారు. ఇదేసమయంలో నాణ్యత పాటించాలని తెలిపారు. ఎఫ్‌సీఐ గోదాంల వాహనాలను ఎక్కువ సేపు నిలపకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మజ, డీఎం సోములు, ఏఎంటీ నర్సింహారావు, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో ముందు నిలవాలి

ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు అభిలాష, మధుసూదన్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల మేరకు అన్ని కార్యక్రమాల్లో ప్రగతి సాధించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులతో పోడు పట్టాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, హరితహారం, జీఓ 58, 59 దరఖాస్తులు, గొర్రెల పంపిణీ, బీసీ బంధుపై అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వంద శాతం ప్రగతి సాధించి ముందు నిలవాలని తెలిపారు. ఇంకా ప్రారంభం కాని జీపీ భవనాల నిర్మాణం వెంటనే మొదలుపెట్టాలని, గడువులోగా మొక్కలు నాటాలని సూచించారు. అలాగే, జీఓ 58, 59 కింద అందిన దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని కలెక్టర్ చెప్పారు.

పకడ్బందీగా కార్యాచరణ

మిషన్ ఇంద్రధనుస్సు సూక్ష్మ ప్రణాళికా కార్యాచరణను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధుల నుంచి గర్భిణులు, చిన్నారులను కాపాడేందుకు నిర్ణీత వ్యవధిలో టీకాలు వేయాలని చెప్పారు.

పారదర్శకంగా ఎన్నికలు

రానున్న అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా జరిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై వివిధ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాను ఈనెల 21న విడుదల చేస్తామని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డి.మధుసూదన్ నాయక్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుమనోహర్, డీఏఓ విజయనిర్మల, పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్, బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, డీఎంహెచ్‌ఓ మాలతి, డీఈఓ సోమశేఖరశర్మ, ఇతర శాఖల అధికారులు శ్రీనివాస్, అరుణ, అశోక్‌చక్రవర్తి, రాజేశ్వరి, శైలజ, రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

జిల్లాకు లక్ష క్లోరిన్ టాబ్లెట్లు

వరద ప్రభావిత ప్రాంతాల్లో పంపిణీకి నిర్ణయం





క్లోరిన్ మాత్రల బాటిళ్లు (ఇన్‌సెట్) క్లోరిన్ మాత్రలు

ఖమ్మం వైద్యవిభాగం: ఇటీవల కురిసిన వర్షాలతో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడగా.. బురద, చెత్తాచెదారం పేరుకుపోయి వివిధ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. పట్టణం, పల్లె తేడా లేకుండా ఇదే పరిస్థితి ఉండటంతో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరిగింది. అలాగే కలరా, టైఫాయిడ్, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండడంతో కట్టడికి అధికారులు సిద్ధమయ్యారు. ప్రధానంగా కలుషిత నీటి ద్వారా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉండడంతో ప్రతీ ఒక్కరు శుద్ధి చేసిన నీటినే తాగాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా నీటి శుద్ధికి ఉపయోగించే క్లోరిన్ మాత్రలను ప్రభుత్వం జిల్లాకు లక్ష కేటాయించింది. వీటిని 26 పీహెచ్‌సీలు, నాలుగు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు శుక్రవారం 3వేల చొప్పున పంపించారు. అలాగే, ఖమ్మం మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పది వేల మాత్రలు కేటాయించారు. వీటిని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా తొలిదశలో వరద ప్రభావిత ప్రాంతాల్లో, ఆతర్వాత మిగతా చోట్ల కూడా ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. 35 ఎం.జీ మాత్ర ఒకటి పది లీటర్ల నీటిలో వేస్తే నీరు శుద్ధి అవుతుందని ఈసందర్భంగా వైద్యులు వెల్లడించారు.

మెడికల్ కళాశాలకు అసోసియేట్ ప్రొఫెసర్లు



డాక్టర్ తులసికి నియామకపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్‌లో త్వరలోనే బోధన ప్రారంభం కానుండగా, ఉద్యోగుల నియామకంలో వేగం పెంచారు. తాజాగా హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ ఉన్నతాధికారులు ఖమ్మం కాలేజీకి ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లను కేటాయించారు. జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఫిజియాలజీ, డెర్మటాలజీ, గైనకాలజీ విభాగాల్లో ఒక్కొక్కరిని నియమించగా వారిలో సదానందం, తులసి శుక్రవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించగా అక్టోబర్ నుంచి బోధన మొదలవుతుందని తెలిపారు. ఇప్పటికే ఆరుగురు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, 23 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 27 మంది సీనియర్ రెసిడెంట్లు, ఐదుగురు హౌస్ సర్జన్లు, 15 మంది డీపీఆర్‌లు కేటాయించారని, త్వరలోనే 80 మందికి పైగా బోధన, బోధనేతర సిబ్బందిని కేటాయించనున్నారని ప్రిన్సిపాల్ చెప్పారు.

క్లుప్తంగా

ఢిల్లీలో జిల్లా ప్రజాప్రతినిధులు



ఢిల్లీలో గాంధీ విగ్రహం వద్ద ఎంపీ నామాతో నాయకులు

కల్లూరు: సత్తుపల్లి, వైరా నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు స్టడీ టూర్‌లో భాగంగా ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు రాష్ట్రపతి భవన్, పార్లమెంట్ భవన్‌ను సందర్శించారు. ఆతర్వాత వారితో ఎంపీ నామా నాగేశ్వరరావు సమావేశమై నియోజకవర్గాల వారీగా సమస్యలపై ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ఐకమత్యంతో ఉండి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, పెనుబల్లి జెడ్పీటీసీ చెక్కిలాల మోహనరావు, నాయకులు పాలెపు రామారావు, పసుమర్తి చందర్‌రావు తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గం ఎన్నిక



సుధాకర్, అధ్యక్షుడు



ప్రవీణ్, కార్యదర్శి

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పునుకుల సుధాకర్, తుడుం ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం ఖమ్మంలోని స్థానిక సుందరయ్య భవనంలో జరగగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు జిల్లా ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ఎస్.కే.పర్వీన్, వి.రాజు, సహాయ కార్యదర్శులుగా వీరేందర్, సరళ, బెజవాడ సాయిశేషు, పి.సాయితో పాటు సభ్యులుగా సంగీత, రాగిణి, స్రవంతి, ఉదయశ్రీ, వెంకటేష్, ఉమేష్, సతీష్, నాగకృష్ణ, వినయ్, యాకూబ్, అజయ్, పావని, భాగ్యశ్రీ, పూజిత ఎన్నికయ్యారు.

కందుకూరు కాలేజీలో నాలుగు కోర్సులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వేంసూరు మండలం కందుకూరులోని బండి సోమకాంతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలు కోర్సులను ఉన్నత విద్యాశాఖ మంజూరు చేసింది. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఇంగ్లిష్, తెలుగు మీడియంల్లో అందుబాటులోకి వచ్చినందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

7న ఆటోడ్రైవర్ల మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు

ఖమ్మం సహకారనగర్: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యాన ఈనెల 7వ తేదీన ఆటోడ్రైవర్ల యూనియన్ సభ నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఐఎన్‌టీయూసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తేదీన జరిగే సభలో కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలతో పాటు కిమ్స్ హాస్పిటల్ తరఫున 50 శాతం రాయితీతో కూడిన హెల్త్ కార్డులను అందజేస్తారని తెలిపారు. జిల్లాలోని ఆటోడ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

ఓసీలో కార్మికుల బస్సును ఢీకొట్టిన లారీ

ఆరుగురికి గాయాలు

సత్తుపల్లిటౌన్: మండలంలోని కిష్టారం ఓపెన్ కాస్టులో శుక్రవారం రాత్రి కార్మికులు వెళ్తున్న బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. రెండో షిఫ్ట్ ముగించుకుని 15మంది డ్రైవర్లు ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కారు. ఈ బస్సు సమీపాన ఆగి ఉన్న మట్టి లారీ అదుపు తప్పి వచ్చి ఢీకొట్టింది. ఘటనలో బస్సు ఓ పక్కకు ఒరిగిపోవటంతో అందులోని కా ర్మికులు ఒకరిపై ఒకరు పడిపోవటంతో బస్సులోని కడ్డీలు తగిలి గాయపడ్డారు. వీరిలో మహేందర్, పంకజ్‌శర్మ, దేవేందర్, అసోమర్తి, షఫీ, అశోక్ మెహతాలకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను కిష్టారం పీఓ నర్సింహారావు పరామర్శించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,150	2,200
కందులు	8,650	8,650
మిర్చి	19,600	13,500
ఏసీ మిర్చి	24,000	18,000
పత్తి	7,050	5,000

– ఖమ్మం వ్యవసాయం

కొనలేం.. తినలేం !

నింగినంటుతున్న కూరగాయల ధరలు

- వానలు, వరదలతో ప్రభావం
- దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వ్యాపారులు
- ఫలితంగా సామాన్యులు కొనలేని పరిస్థితి



ఖమ్మం సమీకృత రైతుబజార్‌లో కూరగాయలు

ఖమ్మంవ్యవసాయం: కూరగాయల ధరలు నింగినంటుతున్నాయి. గత నెల చివరి వారం పది రోజుల పాటు భారీ వర్షాల కంటే ముందుతో పోలిస్తే ధరలు బాగా పెరిగాయి. దీంతో సామాన్యులు మొదలు మధ్యతరగతి వర్గాల వరకు ప్రస్తుత ధరలు భారంగా మారాయి. అన్ని కూరల్లో వాడే టమాట, పచ్చిమిర్చి ధరలు భగ్గుమంటుండగా, మిగతావి కూడా కేజీ రూ.50కి పైగానే పలుకుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ముందే ధరలు ఎక్కువగా ఉన్నాయని అనుకుంటే... వరదల తర్వాత మరింత భారంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దెబ్బతిన్న తోటలు..

విస్తారంగా కురిసిన వర్షాలతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం పంట సాగు, ఉత్పత్తి సీజన్ ప్రారంభమవుతున్న తరుణాన వానలు పడడంతో తోటలపై ప్రభావం చూపింది. జూలై మూడో వారం నుంచి దాదాపు పది రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కూరగాయల తోటలు అధిక తేమ కారణంగా దెబ్బతినగా, మరికొన్ని తోటలు తెగుళ్ల బారిన పడ్డాయి. టమాట, వంగ, బెండ, గోరుచిక్కుడు వంటి తోటలతో పాటు తీగ జాతి పంటలైన కాకర, సొర, బీర, దోస వంటి పంటలు దెబ్బతిన్నాయి. అలాగే, ఆకుకూరల తోటలు నామరూపాలు లేకుండా పోవడంతో మార్కెట్‌లో ఎక్కడా కనిపించడం లేదు. తొలకరి వర్షాలు ఆలస్యం కాగా, నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు వేసిన కూరగాయల పంటలు అధిక వర్షాల కారణంగా దెబ్బతినగా వారు నష్టపోయినట్లయింది.

ఇతర రాష్ట్రాల పంటే దిక్కు..

స్థానికంగా కూరగాయల పంట ఉత్పత్తి పడిపోవడంతో వ్యాపారులు దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయాలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు మన రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రాంతంతో పాటు అనంతపురం, కర్ణాటక రాష్ట్రాల నుంచి టమాట, కడప జిల్లా మైదుకూరు నుంచి పచ్చిమిర్చి, మెదక్ జిల్లా నుంచి కీరదోస, బెంగళూరు ప్రాంతం నుంచి బీట్‌రూట్, క్యారెట్, ఉత్తరప్రదేశ్ ఆగ్రా ప్రాంతం నుంచి ఆలుగడ్డ,, మహారాష్ట్ర నాసిక్ ప్రాంతం నుంచి ఉల్లిగడ్డ దిగుమతి అవుతున్నాయి. ఇక బాపట్ల, సత్తుపల్లి, అశ్వారావుపేట వంటి ప్రాంతాల నుంచి కూడా కూరగాయలు వస్తున్నాయి.

భారంగా మారిన ధరలు..

ప్రస్తుతం కూరగాయల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలుకు అందుబాటులో లేకుండా పోయాయి. ఏ కూరగాయలను కొందామన్నా కిలో దాదాపు రూ.50, అంతకు పైగానే పలుకుతున్నాయి. పచ్చడితో కూర చేసుకొని తిందామన్నా పచ్చిమిర్చి ధర సైతం ఘాటెక్కింది. సామాన్యులు పచ్చిమిర్చిని కొనలేని దశకు ధర చేరుకుంది. కిలో పచ్చిమిర్చి ధర ప్రాంతాన్ని బట్టి రూ.60 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. ఇక టమాట కూడా కిలో రూ.120 నుంచి రూ.180 వరకు పలుకుతుండడం గమనార్హం.

ధరలు భారంగా మారాయి..



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. టమాట కిలో రైతు బజార్‌లో రూ.120 ఉంటే బయట ఇంకా ఎక్కువ చెబుతున్నారు. పచ్చిమిర్చి ధర కూడా అలాగే ఉంది. దీనికి తోడు టమాట అన్నిచోట్ల, అన్నివేళలా లభించటం లేదు. రూ.100 వెచ్చిస్తే రెండు రోజుల కూరగాయలు కూడా రావట్లేదు.

– వాసంశెట్టి నాగమణి, ముస్తఫానగర్, ఖమ్మం

విక్రయాలపై ధరల ప్రభావం



కూరగాయల విక్రయాలపై ధరల ప్రభావం పడింది. గతంలో రోజు మూడు బాక్స్‌ల టమాటాలు విక్రయించేది. ఇప్పుడు బాక్స్ రూ.3,500గా ఉండడంతో కిలో రూ.166 అని చెబితే ఎవరూ కొనడంలేదు. దీంతో రోజుకు బాక్స్ కూడా విక్రయించలేకపోతున్నాం. అన్ని కూరగాయల పరిస్థితి అలాగే ఉంది. – ముదిగొండ నాగమణి, విక్రయదారురాలు, రైతుబజార్, ఖమ్మం

ఖమ్మంలోని రైతుబజార్లలో కొన్ని కూరగాయల ధరలు (కిలోకు రూ.ల్లో)

కూరగాయలు	20న(గతనెల)	4న(ఈనెల)
టమాట	114	120
వంకాయ	26	56
బెండకాయ	30	56
దొండకాయ	20	36
సొరకాయ	20	36
నాటు దోసకాయ	50	66
చిక్కుడు	50	60
గోరుచిక్కుడు	36	46

ఉద్యోగ, అర్చకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ శాఖలోని ఉద్యోగులు, అర్చకుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా దేవాదాయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.మురళి కోరారు. సంఘం సమావేశం ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఏర్పాటుచేయగా ఆయన మాట్లాడారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నియమితులైన ఉద్యోగ, అర్చకులకు ప్రతినెలా కాకుండా నాలుగైదు నెలలకోసారి వేతనాలు ఇస్తుండడంతో ఇబ్బంది ఎదురవుతోందని తెలిపారు. ఈమేరకు ప్రతీనెల వేతనాలు చెల్లించడమే కాక ఉద్యోగులందరినీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, హెల్త్‌కార్డులు ఇచ్చి, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి అన్ని ప్రయోజనాలను కల్పించాలని కోరారు. ఈసమావేశంలో సంఘం బాధ్యులు డీవీఆర్.శర్మ, శేషభట్టా కృష్ణమాచార్యులు, దాములూరి వీరభద్రరావు, తోటకూర వెంకటేశ్వర్లు, కె.రామశర్మ, పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల పోరాటంతోనే రైతు రుణమాఫీ



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: వామపక్ష పార్టీల ఆధ్వర్యాన చేసిన ఆందోళనల ఫలితంగానే రైతుల రుణాలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం హర్షణీయమే అయినా... సకాలంలో రుణమాఫీ జరగకపోవడంతో రైతులపై వడ్డీ భారం పడిందన్నారు. ఈమేరకు వ్యవసాయ అవసరాల కోసం బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు కూడా మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, నాయకులు యర్రా శ్రీకాంత్, యర్రా శ్రీనివాస్, ఎస్.నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, రమ్య, భూక్యా శ్రీనివాస్, గౌస్, పత్తిపాక నాగసులోచన, భాగం అజిత, గుగులోత్ కుమార్, కారుమంచి పవన్ పాల్గొన్నారు.


మందుపాతరలు నిర్వీర్యం

చర్ల: సరిహద్దు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం మావోయిస్టులు ఏర్పాటు చేసిన రెండు శక్తివంతమైన మందుపాతరలను భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశారు. వివరాలిలా ఉన్నా యి. సరిహద్దున ఉన్న బీజాపూర్–సుకుమా జిల్లాల సరిహద్దుల్లోని గోలకొండ గుట్టల్లో పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు 4 కిలోల చొప్పున 50 మీటర్ల దూరంతో రెండు శక్తివంతమైన మందుపాతరలను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో ఏరియా డామినేషన్‌లో భాగంగా జేగురుగొండ పోలీస్ స్టేషన్ నుంచి 210 కోబ్రా బెటాలియన్‌కు చెందిన జవాన్లు బయలుదేరి వెళ్తున్న క్రమంలో బలగాలు ఈ మందుపాతరలను గుర్తించాయి. వైర్లు బయటకు కనిపిస్తుండడంతో గుర్తించి నిర్వీర్యం చేశారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురికి ఏడాది జైలుశిక్ష

ఖమ్మంలీగల్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. ఈమేరకు ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి శుక్రవారం వెలువరించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. 2017 ఆగస్టు 6న వీఎం బంజర్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన నీలాల రాంప్రసాద్, బోయిన వెంకటరమణ, బొమ్మకంటి సత్యం, వర్ల దుర్గ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారి వద్ద పరిశీలించగా రెండు కేజీల గంజాయి లభించడంతో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా, విచారణ సమయంలో నిందితుల్లో ఒకరైన వర్ల దుర్గ మరణించింది. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వర్లు, హరేందర్‌రెడ్డి వాదించగా బి.సైదులు, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.మోహన్ రావు, ఎం.డీ.అయూబ్ సహకరించారు.

యూపీ వాసి మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మంక్రైం: రైలులో వెళ్తూ గుండెపోటుతో మృతి చెందిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజేశ్వర్ అంత్యక్రియలను శుక్రవారం ఖమ్మంలో నిర్వహించారు. కేరళ నుంచి స్వస్థలానికి వెళ్తున్న ఆయన ఖమ్మం సమీపాన మృతి చెందడంతో ఇక్కడ మృతదేహాన్ని దించారు. ఆయన బంధువులు శుక్రవారం ఇక్కడకు రాగా, మృతదేహన్ని స్వస్థలానికి తరలించే పరిస్థితి లేకపోవటంతో జీఆర్పీ సిబ్బంది సమక్షాన అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

డబ్బు కోసమే హత్యలు..

- తల్లీకుమారుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- చెడు అలవాట్లకు బానిస కావడంతో ఘాతుకం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రామానుజం, పక్కన సీఐ మోహన్‌బాబు, ఉద్యోగులు

సత్తుపల్లి: డబ్బు చోరీ చేసేందుకు వెళ్లి తల్లీకొడుకును హత్య చేసిన ఆటోడ్రైవర్ దర్శనపు సునీల్ అలియాస్ మహేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో సత్తుపల్లి మండలం నారాయణపురంలో సోమవారం రాత్రి జరిగిన జంట హత్యల మిస్టరీ వీడినట్లయింది. ఈమేరకు సత్తుపల్లి పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కల్లూరు ఏసీపీ రామానుజం వివరాలు వెల్లడించారు.

సత్తుపల్లి తీసుకెళ్లి.. తీసుకొచ్చి

నారాయణపురానికి చెందిన రాయల తులశమ్మ తన కుమారుడు, దివ్యాంగుడైన సత్యనారాయణ అలియాస్ చంటితో కలిసి సోమవారం ఆటోలో సత్తుపల్లి బ్యాంక్‌కు వెళ్లి నగదు డ్రా చేసింది. ఆతర్వాత సరుకులు, బియ్యం కొనుగోలు చేసి మళ్లీ అదే ఆటోలో స్వగ్రామానికి వచ్చింది. ఈక్రమంలో తులశమ్మ వద్ద నగదు, ఆమె మెడలో బంగారు గొలుసు చూసిన ఆటోడ్రైవర్ మహేష్ చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. దురలవాట్లకు బానిసైన ఆయన గతంలోనూ పలు కేసుల్లో నిందితుడిగా ఉండడంతో వృద్ధురాలైన తులశమ్మతో పాటు ఆమె కుమారుడు దివ్యాంగుడైన చంటిని ఏమార్చి సులువుగా దొంగతనం చేయొచ్చని భావించాడు. ఈమేరకు సోమవారం రాత్రి వారి ఇంటికి వెళ్లగా పెనుగులాటలో మొదట తులశమ్మను ఆమె ఇంట్లోని కొడవలితోనే గొంతు కోసి హత్య చేశాడు. ఆతర్వాత ఇది చూసిన దివ్యాంగుడైన సత్యనారాయణను కూడా గొంతు కోసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందని ఏసీపీ చెప్పారు.

డబ్బు బ్యాంకులో జమ

తులశమ్మ ఇంట్లో చోరీ చేసిన రూ.40వేలలో రూ.4వేలు ఖర్చు చేసిన మహేష్ మిగిలిన రూ.36వేలను సత్తుపల్లిలోని తన బ్యాంకు ఖాతాలో జమ చేసుకున్నాడు. దీంతో నగదు జప్తు చేయడమే కాక బంగారు నాన్‌తాడు, హత్యకు ఉపయోగించిన కొడవలి, నిందితుడి ఆటో, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, మహేష్ గతంలో సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చేసి జైలు జీవితం గడపగా, రెండు కొట్లాట కేసుల్లోనూ నిందితుడిగా ఉన్నాడని చెప్పారు. ఈమేరకు ఆయనను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా, జంట హత్యల కేసును సీపీ విష్ణు ఎస్.వారియర్ సూచనలతో త్వరగా ఛేదించినట్లు ఏసీపీ వివరించారు. ఈమేరకు సత్తుపల్లి పట్టణ, రూరల్ సీఐలు జె.మోహన్‌బాబు, హనూక్, సిబ్బందిని సీపీ అభినందించగా, రివార్డుకు సిఫారసు చేసినట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వల తవ్వకానికి మార్కింగ్



ప్రతిపాదిత ప్రాంతంలో పరిశీలిస్తున్న అధికారులు

కూసుమంచి: మండలంలోని లోక్యాతండా, కోక్యాతండా, కూసుమంచి గ్రామాల పరిధిలో శ్రీరాంసాగర్ రెండో దశలో 7ఆర్ కాల్వల తవ్వకానికి మార్కింగ్ చేశారు. భూపరిహారం విషయమై పలువురు రైతులు కోర్టుకు వెళ్లడంతో కొన్నేళ్ల క్రితం పనులు నిలిచిపోయాయి. తాజాగా ప్రభుత్వం పెంచిన పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో అధికారులు మిగిలిపోయిన కాల్వల తవ్వకానికి రంగంలోకి దిగి శుక్రవారం మార్కింగ్ చేశారు. జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లుతో పాటు డీఈ రత్నకుమారి, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

ఖమ్మంక్రైం: ఇటీవల మున్నేటికి వచ్చిన వరదతో ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు మోటారు కార్మికుల అసోసియేషన్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు అందజేశారు. ఈమేరకు 800 కుటుంబాలకు ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి చేతుల మీదుగా సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అశోక్, మోటారు కార్మికుల అసోసియేషన్ బాధ్యులు పాషా, కిషోర్, అలీమ్, అక్బర్ పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న ఏసీపీ సారంగపాణి

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌డీసీ

ఖమ్మం సహకారనగర్: ఐపీటీ రైల్వేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ)గా నియమితులైన మొల్లి రాజేశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మొదట ఈ పోస్టులో వై.పీ.రమేష్‌ను నియమించగా ఆయన ఇప్పటివరకు విధుల్లో చేరలేదు. దీంతో రాజేశ్వరిని కేటాయించగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

వస్త్ర దుకాణంలో చోరీ

బోనకల్: మండల కేంద్రంలోని మణికంఠ వస్త్ర దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆర్వోబీ సమీపంలోని షాపు తాళాలు పగులగొట్టిన దుండగులు రూ.2 లక్షలు విలువైన వస్త్రాలు, సౌండ్ సిస్టమ్, సీసీ కెమెరా వీవీఆర్ ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన యజమాని గుగులోతు దుర్గాప్రసాద్ ఫిర్యాదుతో పోలీసులు, క్లూస్‌టీం సభ్యులు చేరుకుని వివరాలు సేకరించారు.

యువకుడు ఆత్మహత్య



కృష్ణ (ఫైల్)

నేలకొండపల్లి: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని మోటాపురానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు చావా కృష్ణ(30) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, వివిధ పార్టీల నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు, రావెళ్ల కృష్ణరావు, నున్నా రవికుమార్, చావా కిరణ్‌కుమార్ తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు పరామర్శించారు.

పాముకాటుతో రైతు మృతి



రైతు ప్రసాద్ మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య ధనలక్ష్మి

సత్తుపల్లిటౌన్: పొలంలో నాట్లు వేస్తుండగా పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం తుంబూరులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేల్పుల ప్రసాద్(45) తన పొలంలో నాటు వేస్తుండగా పొలంలో కట్లపాము కాటు వేసింది. దీంతో ఆయనను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ధనలక్ష్మి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, యాదవ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ప్రసాద్ మృతదేహం వద్ద కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ రాగమయి, కొండూరు సుధాకర్, కొర్రపాటి సాల్మన్‌రాజు, శివవేణు, ఉడతనేని అప్పారావు తదితరులు నివాళులర్పించారు. అలాగే, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఫోన్‌లో ఆయన కుటుంబీకులను పరామర్శించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి...

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెంకు చెందిన ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎన్నబోయిన వెంకట్రాములు(55) చేపలు పట్టేందుకు నానుతండా వద్ద ఉన్న వాగు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్ గురై మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా, పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మూడేళ్లకే నూరేళ్లు...

నీటి సంప్‌లో పడి బాలిక మృతి



శైలజ మృతదేహం

కూసుమంచి: ఆడుకుంటూ వెళ్లి మూత లేని నీటి సంపులో పడిన మూడేళ్ల బాలిక మృతి చెందింది. మండలంలోని జుజుల్‌రావుపేటకు ఎస్సీ కాలనీకి చెందిన నేలమర్రి ఎల్లయ్య – మమత డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎల్లయ్య దంపతులు కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె శైలజ(3) శుక్రవారం సాయంత్రం ఆడుకునేందుకు బయటకు వెళ్లింది. రాత్రయినా తిరిగి రాకపోవటంతో తల్లిదండ్రులు వెతుకుతుండగా ఇంటి పక్కన ఉండే నీళ్ల సంప్‌లో పడినట్లు గుర్తించారు. బయటకు తీసి చూడగా అప్పటికే శైలజ మృతి చెందింది. కాగా, సదరు ఇంటి యజమానులు లేకపోగా, సంప్‌పై మూతకు బదులు బస్తాలు కప్పడంతో ఆడుకుంటూ వెళ్లిన శైలజ ప్రమాదవశాత్తు పడిందని భావిస్తున్నారు. కాగా, బధిరురాలైన ఆమె తల్లి మమత కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించడం అందరినీ కలిచివేసింది.

క్లుప్తంగా...

కౌంటరు వేయకపోతే జరిమానా తప్పదు

ఉమ్మడి ఆస్తుల విభజనకేసులో కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఉమ్మడి ఆస్తుల విభజన కేసులో కౌంటరు దాఖలు చేయకుంటే జరిమానా తప్పదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇరురాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజన జాప్యంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీ.భట్టిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఉమ్మడి ఆస్తుల విభజనకు జస్టిస్ రామసుబ్రమణియన్‌ను మధ్యవర్తిగా నియమించాలని ఏపీ తరఫు ఏఓఆర్ మెహఫూజ్ నజ్కీ కోరారు. దీనికి తెలంగాణ తరఫు న్యాయవాది వైద్యనాథన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేంద్రం కౌంటరు దాఖలు చేయని విషయం ధర్మాసనం దృష్టికి రాగా, గతంలో 4 వారాల గడువు ఇచ్చినా ఇప్పటికీ దాఖలు చేయలేదా అని ప్రశ్నించింది. 3 వారాల్లోగా కౌంటరు దాఖలు చేయాలని లేకుంటే జరిమానా విధిస్తామని కేంద్రం తరఫు న్యాయవాదికి తెలిపింది. కేంద్రం కౌంటరుపై రిజాయిండరు దాఖలుకు మరో మూడు వారాలు గడువిస్తూ... తదుపరి విచారణ అక్టోబరుకు వాయిదా వేసింది.

వైద్యారోగ్యశాఖలో 'రెవెన్యూ' పెత్తనం సహించం

తెలంగాణ ప్రభుత్వవైద్యుల సంఘం


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో రెవెన్యూ అధికారుల పెత్తనాన్ని సహించేది లేదని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం స్పష్టం చేసింది. ఆర్డీవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లుగా వైద్యవిధాన పరిషత్‌లో పనిచేసే వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి, ట్రెజరీ ద్వారా జీతాలు అందించాలని కోరింది. మెడికల్ కళాశాలలో పనిచేసే వైద్యులకు 2016 పీఆర్సీ వేతన బకాయిలు, రూరల్ మెడికల్ కళాశాలల్లోని బోధన వైద్యులకు రూరల్ అలవెన్సులు వెంటనే విడుదల చేయాలని కోరింది. హెల్త్ డైరెక్టర్ పరిధిలో నిర్ణీతకాల వ్యవధి ప్రమోషన్లను వెంటనే కల్పించాలని, సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులను, డీసీహెచ్ఎస్‌లను 33 జిల్లాలకు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల ప్రతినిధుల బృందం త్వరలో సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపింది.

వివేకా లేఖను పట్టించుకోరా?

అన్ని గొడ్డలి వేట్లు పడ్డాక ఆయన లేఖ రాశారా?

మెదడు బయటికి వచ్చాక కూడా రాయడం సాధ్యమేనా?

- ఈ విషయంపై వైద్యుల అభిప్రాయం తీసుకోవాలి కదా!
- ఇంత ముఖ్యమైన అంశాన్ని ఎందుకు విస్మరించారు?
- ఘటనా స్థలంలో వేలి ముద్రల సంగతి ఏమైంది?
- అక్కడున్న వారందరివీ కాకుండా కొత్త వేలి ముద్రలు ఎవరివి?
- నిందితులు ఆస్తి పత్రాల కోసం వెదికారన్నది వాస్తవం..
- అలాంటప్పుడు ఈ అంశంపై ఎందుకు దృష్టి పెట్టలేదు?
- అవగాహన లేకుండా గూగుల్ టేక్ అవుట్ అంటూ హడావుడి దేనికి?
- ఐపీడీఆర్ డేటా ద్వారా కాల్స్, మెసేజ్‌ల వివరాలన్నీ తెలియవు
- వివేకా హత్య కేసు దర్యాప్తు తీరుపై 'ద వైర్' విశ్లేషణాత్మక కథనం



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అత్యంత కీలకమైనదిగా భావిస్తున్న వివేకా లేఖపై సీబీఐ నిశితంగా దృష్టి సారించక పోవడం విస్మయ పరుస్తోందని ప్రముఖ జాతీయ వార్త వెబ్ సైట్ 'ద వైర్' పేర్కొంది. 'డ్రైవర్ ప్రసాద్ తనపై తీవ్రంగా దాడిచేసినట్టు వివేకా పేర్కొన్నట్టు ఆ లేఖలో ఉంది. లేఖను వంట మనిషి లక్ష్మమ్మ కుమారుడు ప్రకాశ్ చూసి పీఏ కృష్ణా రెడ్డికి ఇచ్చాడు. ఆయన వెంటనే అంటే ఉదయం 6.29కి వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్‌చేసి ఆ లేఖలోని సమాచారాన్ని చదివి వినిపించారు. తాము వచ్చే వరకు లేఖను గోప్యంగా ఉంచమని, ఎవ్వరికీ ఇవ్వొద్దని చెప్పారు. కాసేపటి తర్వాత అక్కడకు వచ్చిన సీఐ శంకరయ్యకు కూడా కృష్ణారెడ్డి ఆ లేఖ విషయం చెప్పలేదు. వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరెడ్డి తదితరులు పులివెందులకు చేరుకున్నాక ఆ రోజు సాయంత్రం ఆ లేఖను వైఎస్సార్ జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మకు అప్పగించారు' అనే విషయాన్ని చార్జ్‌షీట్‌లో ప్రస్తావించడం మినహా ఇంత కీలకమైన విషయంపై సీబీఐ ఎందుకు లోతుగా దర్యాప్తు చేయలేదని ప్రశ్నించింది. రాజకీయ, నేర సంబంధమైన పరిశోధనాత్మక పాత్రికేయంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ జర్నలిస్ట్ సరితా రాణి 'ద వైర్' వెబ్‌సైట్‌లో రాసిన రెండవ కథనంలో ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు. ఆ వివరాలివీ..

తీవ్ర గాయాలతో లేఖ రాయగలిగారా?

వివేకా లేఖపై ఇప్పటికీ సందిగ్ధత తొలగిపోలేదు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి వాంగ్మూలం ఇప్పించే వరకు ఆ లేఖ ఎప్పుడు రాశారన్న దానిపై స్పష్టత రాలేదు. వివేకాపై దాడి తర్వాత ఆయనతో బలవంతంగా ఆ లేఖను తాము ఎలా రాయించిందీ దస్తగిరి వెల్లడించాకే సందేహాలు మరింత పెరిగాయి. దస్తగిరి తన వాంగ్మూలంలో వెల్లడించిన ప్రకారం.. మొదట సునీల్‌యాదవ్ వివేకానందరెడ్డి ముఖంపై గట్టిగా కొట్టాడు. దాంతో వివేకా కింద పడిపోయారు. ఉమాశంకర్ రెడ్డి గొడ్డలితో వివేకా నుదుట మీద నరికాడు. వివేకా నుదుటి మీద 3.5 ఇంచ్‌ల వెడల్పు, 6 ఇంచ్‌ల లోతుగా పక్క పక్కనే రెండు గాయాలున్నాయని పోస్టుమార్టం నివేదికలో ఉంది. సునీల్‌యాదవ్ వివేకా గుండెపై 15–16 సార్లు గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఉమాశంకర్ రెడ్డి తన చేతిలో ఉన్న గొడ్డలిని దస్తగిరికి ఇచ్చి వివేకా లేవకుండా చూడమని చెప్పారు. తాము భూమి పత్రాలు ఎక్కడున్నాయో వెతుకుతామని చెప్పాడు. వివేకా అతి కష్టం మీద లేవడానికి ప్రయత్నిస్తూ నా ఇంట్లో ఏం వెతుకుతున్నారని ప్రశ్నించారు. దాంతో దస్తగిరి గొడ్డలితో వివేకా కుడి చేతిపై దాడి చేశాడు. దీంతో వివేకా కుడి అరచేతిలో 2 ఇంచ్‌ల వెడల్పు, ఒక ఇంచి లోతున గాయం ఉందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. కుడి చేతి మీద గొడ్డలితో గాయపరిచిన తర్వాత వివేకాతో నిందితులు లేఖ రాయించారు. కుడి చేతివాటం వ్యక్తి అయిన వివేకా ఆ లేఖ రాశారని సీబీఐ పేర్కొంది. గాయం వల్ల వివేకా మెదడు బయటకు వచ్చిందని దస్తగిరి చెప్పడం గమనార్హం. అంత తీవ్ర గాయమయ్యాక లేఖ రాసే స్థితిలో వివేకా ఉన్నారా అన్నది ప్రశ్నార్థకం. ఆ లేఖ వివేకానే రాసినట్టు హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ నిర్ధారించింది. కాగా తీవ్రమైన ఒత్తిడి, అత్యంత సంక్లిష్ట ప్రక్రియ నడుమ ఆ లేఖ రాసినట్టుగా ఉందని ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ నివేదిక వెల్లడించింది. కానీ అంతటి తీవ్ర గాయాలతో, మెదడు బయటకు వచ్చిన తర్వాత కూడా ఓ వ్యక్తి అలా లేఖ రాయడం సాధ్యమా? అని సీబీఐ వైద్య నిపుణులను సంప్రదించకపోవడం విడ్డూరం.

ఆ వేలిముద్రలు ఎవరివో?

హత్య కేసు దర్యాప్తులో వేలిముద్రలే కీలకం. అయితే వివేకా హత్యకు గురైన స్థలంలో గుర్తించిన 3 గుర్తు తెలియని వేలిముద్రలు ఎవరివనే దానిపై సీబీఐ ఇప్పటి వరకు దృష్టిసారించలేదు. వివేకా నివాసంలోని బాత్‌రూమ్ గోడల టైల్స్ మీద రెండు, తలుపు వెనుక ఒక వేలిముద్రను క్లూస్ టీమ్ గుర్తించింది. గోడల టైల్స్ మీద ఉన్న వేలిముద్రలు రక్తంతో ఉండటం గమనార్హం. కాగా ఆ మూడు వేలిముద్రలు నిందితులు నలుగురితోపాటు వివేకా నివాసానికి వచ్చిన బంధువులు, ఇతరుల వేలి ముద్రలతో సరిపోలలేదు. అంటే గుర్తు తెలియని వ్యక్తులు ఆ రోజు రాత్రి వివేకా నివాసంలో ఉన్నట్టుగా భావించాల్సి వస్తోంది. కానీ సీబీఐ ఇప్పటి వరకు ఆ వేలిముద్రలు ఎవరివనే దిశగా దర్యాప్తు చేయలేదు.

ఐపీడీఆర్ డేటా అహేతుకం

ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు 'ఇంటర్నెట్ ప్రోటోకాల్ డిటైల్ రికార్డ్స్(ఐపీడీఆర్) నివేదిక ఆధారంగా గుర్తించినట్టు సీబీఐ పేర్కొంది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 1.37 నుంచి 5.02 గంటల వరకు వారిద్దరి మొబైల్ ఫోన్ల డేటా ఆన్‌లో ఉన్నట్టుగా చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ ఐపీడీఆర్ డేటా అన్నది శాస్త్రీయంగా కచ్చితమైన ఆధారం కాదు. ఆ సమయంలో మొబైల్ ఫోన్లు ఆన్‌లో ఉన్నాయని మాత్రమే ఐపీడీఆర్ చెబుతుంది. సాధారణంగా అర్ధరాత్రి దాటాక మొబైల్ నెట్‌వర్క్‌లు తమ డేటా బ్యాకప్ తీసుకుంటూ ఉంటాయి. దాంతో మొబైల్ డేటా ఆన్‌లో ఉన్నట్టు చూపిస్తుంది. అంత మాత్రాన ఆ మొబైల్ ఫోన్ల ద్వారా మాట్లాడుతున్నట్టుగానీ, మెసేజ్‌లు పంపిస్తున్నట్టుగానీ నిర్ధారించినట్టు కాదు. ఇక ఆ ఫోన్ల నుంచి ఇతర ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లాయా.. లేదా అన్నది కూడా ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. కాబట్టి ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్‌రెడ్డి మధ్య ఆ రోజు రాత్రి వాట్సాప్ చాటింగ్ జరిగినట్టు ఐపీడీఆర్ డేటా ద్వారా నిర్ధారించలేం. ఈ విషయంలో సీబీఐ వాదన పూర్తిగా అహేతుకమని స్పష్టమవుతోంది. గంగిరెడ్డి మొబైల్ ఫోన్ నుంచి వెళ్లిన మెసేజ్‌లను గుర్తించేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదని సీబీఐ తెలిపింది. కాగా 2019 మార్చి 15నే ఎర్ర గంగిరెడ్డి మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డేటాను పరిశీలించినా.. అందులో అనుమానాస్పదమైన సమాచారం లభించలేదని పోలీసులు ప్రకటించిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆస్తి వివాదాన్ని ఎందుకు పట్టించుకోలేదు?

రాజకీయ కారణాలతోనే వివేకాను హత్య చేశారని సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. కానీ దస్తగిరి, రంగన్న వాంగ్మూలాలను పరిశీలిస్తే ఆస్తి కోసం ఈ హత్య చేసి ఉండొచ్చన్నది స్పష్టమవుతోంది. ఎందుకంటే వివేకాను హత్య చేసిన తర్వాత నిందితులు ఆస్తి పత్రాల కోసం ఆయన నివాసంలో వెతికారన్నది స్పష్టమవుతోంది. నివాసంలో అల్మారా (బీరువా) తలుపు బద్దలు గొట్టడానికి ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు కూడా. అంటే హత్యకు ఆస్తి వివాదం ప్రధాన కారణం కావచ్చు. నిందితులు ఏ పత్రాల కోసం వెతికారన్నది సీబీఐ ఇప్పటి వరకు గుర్తించలేకపోయింది. దొంగతనం, ఆస్తి వివాదం అనే కోణంలో సీబీఐ ఈ కేసును ఎందుకు దర్యాప్తు చేయడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఒకే సమయంలో రెండుచోట్ల ఉండటం సాధ్యమా?

సునీల్ యాదవ్ ఎక్కడ ఉన్నారనే దానిపై సీబీఐ వాదనలు మరింత అసంబద్ధంగా ఉన్నాయి. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన వాంగ్మూలం, రంగన్న వాంగ్మూలం ప్రకారం ఆ రోజు రాత్రి 1.30 గంటల నుంచి 3 గంటల వరకు సునీల్ యాదవ్ వివేకానందరెడ్డి నివాసం లోపల ఉన్నాడు. కానీ ఆ రోజు రాత్రి 1.58 గంటలకు సునీల్ యాదవ్.. వైఎస్ భాస్కర్‌రెడ్డి నివాసంలో ఉన్నట్టుగా గూగుల్ టేక్ అవుట్ డేటా చూపిస్తోందని కూడా సీబీఐ పేర్కొంది. ఒకే సమయంలో ఒక వ్యక్తి వేర్వేరు చోట్ల ఎలా ఉండగలరు? సునీల్ యాదవ్ ఆ సమయంలో వైఎస్ భాస్కర్ రెడ్డి నివాసంలో ఉంటే.. అదే సమయంలో అక్కడికి కిలోమీటర్ దూరంలో ఉన్న వివేకా నివాసంలో కూడా ఉండి ఆయన్ను ఎలా హత్య చేయగలడు? మరి సీబీఐ ఇంత చిన్న అంశాన్ని విస్మరిస్తూ కేసు దర్యాప్తు చేస్తుండటం ఏమిటి?.

రూ.40 కోట్ల డీల్ కథ తేల్చలేదెందుకు?

అసలు వివేకానందరెడ్డిని నిందితులు ఎందుకు హత్య చేశారనే అంశంపై సీబీఐ వాదన అసంబద్ధంగా ఉంది. దస్తగిరి వాంగ్మూలం ప్రకారం.. వివేకాను హత్య చేస్తే శివశంకర్ రెడ్డి రూ.40 కోట్లు ఇస్తారని ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని దస్తగిరి పేర్కొన్నాడు. అందుకు సునీల్ యాదవ్ ద్వారా దస్తగిరికి అడ్వాన్స్‌గా రూ.కోటి పంపించారు. అందులో రూ.25 లక్షలు సునీల్ యాదవ్ అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులతో పులివెందులలో విల్లా కొనుగోలు చేయాలని భావించినట్టు దస్తగిరి చెప్పాడు. కాగా ఇక్కడ ప్రశ్నార్థకం ఏమిటంటే.. వివేకా హత్య కోసం కుదిరినట్టు చెబుతున్న డీల్ డబ్బును సీబీఐ ఇప్పటికీ రికవరీ చేయలేకపోయింది. కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కూడా సీబీఐని ఇదే విషయంపై ప్రశ్నించారు. నిందితుల మధ్య చేతులు మారినట్టు చెబుతున్న డబ్బును ఎందుకు రికవరీ చేయలేకపోయారంటే సీబీఐ సరైన సమాధానం చెప్పలేకపోయింది. పులివెందులలో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్న మున్నా బ్యాంక్ లాకర్ నుంచి రికవరీ చేసిన రూ.46.70 లక్షలకు సంబంధించి సీబీఐ చెబుతున్న వాదన నమ్మదగ్గదిగా లేదని కూడా న్యాయస్థానం వ్యాఖ్యానించడం గమనార్హం. 2020 సెప్టెంబర్ 9న మున్నా బ్యాంకు లాకర్లో ఉన్న రూ.46.70 లక్షలను సీబీఐ జప్తు చేసింది. ఈ జప్తు వ్యవహారం భారత సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 27 ప్రకారం లేదని న్యాయస్థానం స్పష్టం చేయడం గమనార్హం.

గూగుల్ టేక్ అవుట్‌పై మాట మారింది!

నిందితులు 2019 మార్చి 14, 15 తేదీల్లో ఎక్కడ ఉన్నారనే విషయాన్ని గూగుల్ టేక్ అవుట్ ద్వారా నిర్ధారించామన్న సీబీఐ వాదన తప్పని తేలిపోయింది. ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి ఫోన్లు వారి ఇళ్లలోనే ఉన్నట్టుగా సెల్ టవర్ల లోకేషన్ స్పష్టం చేస్తోంది. కాగా సునీల్ యాదవ్ మొబైల్ ఫోన్ గూగుల్ టేక్ అవుట్ డేటాపై సీబీఐ ఎక్కువగా దృష్టి సారించింది. 2019 మార్చి 14 అర్ధరాత్రి 2.42కి సునీల్ యాదవ్ వివేకా నివాసంలో ఉన్నట్టు.. 2.34కి వివేకా నివాసానికి 15 మీటర్ల దూరంలో, 2.35కి వివేకా నివాసానికి 10 మీటర్ల దూరంలో ఉన్నట్టు.. 2.42కి వివేకా నివాసంలో ఉన్నట్టు పేర్కొంది. కాగా సునీల్ యాదవ్ నివాసం వివేకా నివాసానికి 160 మీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఎంతో ముఖ్యమైన అంశం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల్లో గూగుల్ టేక్ అవుట్ డేటాకు, వాస్తవ లోకేషన్‌కు 500 మీటర్ల నుంచి 1,500 మీటర్ల వరకు వ్యత్యాసం ఉంటుందని నిపుణులే చెబుతున్నారు. అందుకే ఈ కేసు విచారణ సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఆ విషయాన్ని ప్రశ్నించారు. గూగుల్ టేక్ అవుట్ డేటాను బట్టి ఎలా నిర్ధారించగలుగుతారని అడిగారు. దాంతో సీబీఐ తన మూడో అనుబంధ చార్జ్‌షీట్‌లో మాట మార్చింది. యూనివర్సల్ కాలమానానికి (యూటీసీ), భారత కాలమానానికి (ఐటీసీ) మధ్య వ్యత్యాసాన్ని తాము గమనించక పొరపాటు చేశామని వెల్లడించడం గమనార్హం. గూగుల్ టేక్ అవుట్ డేటాను విశ్లేషిస్తూ ఢిల్లీలోని సీఎఫ్ఎస్ఎల్ పేర్కొన్న సమయం యూటీసీ కాలమానం ప్రకారం అని వెల్లడించింది. వాస్తవానికి యూటీసీ కాలమానం కంటే భారత కాలమానం 5.30 గంటలు ముందుంటుంది. అంటే సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 14 అర్ధరాత్రి దాటిన తర్వాత 2.42 గంటలకు ఉన్నట్టు తాము మొదటి చార్జ్‌షీట్‌లో పేర్కొంది వాస్తవం కాదని సీబీఐ అంగీకరించింది. సునీల్ యాదవ్ వివేకా నివాసంలో 2019 మార్చి 15న ఉదయం 8.12కి ఉన్నారని తెలిపింది. అంటే వివేకా హత్యకు గురయ్యారని అందరికీ తెలిసిన తర్వాత కొన్ని వందల మంది అక్కడ గుమిగూడిన తర్వాత సునీల్ యాదవ్ చేరుకున్నారని చెప్పింది.

జిల్లా వార్తలు

జనారణ్యంలోకి చుక్కల దుప్పి..

కిన్నెరసానికి తరలిస్తుండగా మృతి



జనావాసాల్లో తిరుగుతున్న దుప్పి

సత్తుపల్లిటౌన్: చెంగుచెంగున దూకుతూ జనారణ్యంలోకి వచ్చిన చుక్కల దుప్పి శుక్రవారం సత్తుపల్లిలో అటవీశాఖ సిబ్బందికి చిక్కింది. స్థానిక అయ్యగారిపేట రోడ్డులో నివాసాల మధ్య మైదానంలో మేత మేస్తున్న చుక్కల దుప్పిని స్థానికులు గమనించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు సిబ్బందితో చేరుకుని వల వేసి దుప్పిని పట్టుకున్నారు. కాగా, అటూఇటు దూకుతున్నప్పుడు ప్రహరీని తాకడంతో దుప్పి మూతికి గాయాలయ్యాయి. దీంతో పశువైద్యశాలకు తరలించి చికిత్స చేయించాక కిన్నెరసాని అభయారణ్యానికి తరలిస్తుండగానే మృతి చెందింది. ఈమేరకు పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించాక అర్బన్ పార్కులో ఖననం చేశారు. కాగా, కాకర్లపల్లి బీట్ నుంచి ఈ దుప్పి వారం క్రితం తప్పించుకొచ్చినట్లు తెలిసింది.

పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఓఅండ్‌ఎం సీఈ



పాలేరు అలుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను శుక్రవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్(ఓఅండ్‌ఎం) సీఈ జి.రమేష్‌బాబు పరిశీలించారు. ఇటీవల వరదలతో జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులకు కలిగిన నష్టాన్ని ఆయన అంచనా వేసేందుకు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాలేరును సందర్శించి గేట్లు, అలుగుల వద్ద వరద ప్రవాహంపై ఆరా తీశారు. ఆతర్వాత మండలంలోని భక్తరామదాసు ప్రాజెక్టును కూడా సందర్శించి వరద నష్టం వివరాలు తెలుసుకున్నారు. నీటిపారుదలశాఖ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈఈలు రత్నకుమారి, మధు తదితరులు ఉన్నారు.

మళ్లీ ఇనుప వంతెనే దిక్కు!



నడిమిగూడెం - మోదుగులగూడెం మధ్య కోతకు గురైన బ్రిడ్జి



ఇనుప వంతెన మీదుగా దాటుతున్న గిరిజనులు

- 2021లో నిర్మించినా చెక్కుచెదరని వైనం
- ఆ తర్వాత నిర్మించిన బ్రిడ్జి మాత్రం కోత

గుండాల: నాడు భారీ వర్షాలతో రాకపోకలు నిలిచిపోయాయి.... బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండడంతో గిరిజనులు దిక్కుతోచని స్థితిలో కర్రల సాయంతో దాటుతున్నారు. ఈ క్రమంలో 'సాక్షి'లో 'ఈ సాహసం ప్రమాదకరమై'నది'' శీర్షికన ప్రచురితమైన కథనంతో స్పందించి పోలీసులు తాత్కాలికంగా ఇనుప వంతెన నిర్మించారు. అప్పట్లో ఈ వంతెన గిరిజనులకు ఆదెరువుగా నిలవగా.. అనంతరం బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. కానీ మొన్నటి వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోయినా, ఇనుప వంతెన మాత్రం చెక్కు చెదరకపోవడంతో ఇప్పుడు గిరిజనులకు మళ్లీ అదే దిక్కయింది.

2021లో తాత్కాలికంగా...

మండలంలోని మోదుగుల గూడెం-నడిమిగూడెం మధ్య కిన్నెరసానిపై 2021కి ముందే బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. కానీ పూర్తికాకపోవడంతో వర్షకాలంలో దాటుడు బండలపై కర్రలు వేసి గిరిజనులు దాటేవారు. 2021 జూలైలోనూ భారీ వర్షాలు కురుస్తున్న సమయాన ఇదే పరిస్థితి నెలకొనగా ప్రమాదకరంగా మారిన విషయమై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అప్పటి గుండాల ఎస్సై ముత్యం రమేష్ తన సిబ్బందితో కలిసి ఇనుప వంతెన ఏర్పాటు చేశారు. అనంతరం 2022లో బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. అప్పటి నుంచి రాకపోకలు సాఫీగా సాగుతున్నా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి రెండు వైపులా కోతకు గురైంది. ఫలితంగా ఆనాడు పోలీసులు ఏర్పాటుచేసిన వంతెన పైనుంచే మళ్లీ గిరిజనులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాగులు వస్తున్న క్రమంలో నడిమిగూడెం, సజ్జలబోడు, నాగారం, కొడవటంచ, పాలగూడెం, దొంగతోగు గ్రామాలకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతోంది.

ఈమేరకు ఇనుప వంతెనపై దాటుతున్న ఆయా గ్రామాల ప్రజలు ఇప్పుడు కొత్తగూడెంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ముత్యం రమేష్‌ను సేవలను గుర్తుచేసుకుంటున్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో


15 రోజులుగా పర్ణశాలవాసుల ఇక్కట్లు



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం: మిషన్ భగీరథ ఇం టేక్‌వాల్, ప్లాంట్ ఉన్నది అక్కడే.. అక్కడి నుండే మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. కానీ ఆ గ్రామానికి మాత్రం 15 రోజులుగా తాగు నీరు అందడంలేదు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో గత 15 రోజులుగా తాగునీరు రాకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ చెంతనే గోదావరి ఉన్న తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక నరకయాతన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గోదావరికి వరద వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. గంట పాటు రాస్తారోకో చేపట్టడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింప చేశారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులు కూడా పర్ణశాల వచ్చి నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు.

అడవుల పునరుద్ధరణకు శ్రమించాలి: సీసీఎఫ్ భీమానాయక్



బొజ్జాయిగూడెంలో మంకీఫుడ్ కోర్టును పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్, అధికారులు

ఇల్లెందురూరల్: అడవుల పునరుద్ధరణకు ప్రతీఒక్కరు శ్రమించాలని సీసీఎఫ్ భీమానాయక్ సూచించారు. ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో ఏర్పాటుచేసిన మంకీ ఫుడ్ కోర్టును శుక్రవారం ఆయన పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అటవీశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమైన సీసీఎఫ్ మాట్లాడుతూ.. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినందున, ఇక నుంచి కొత్త పోడుకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. అలాగే, నిర్దేశిత లక్ష్యం మేరకు ప్లాంటేషన్ చేపట్టాలని, కలప స్మగ్లింగ్‌ను అరికట్టడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓ కె.వెంకన్న, ఎఫ్ఆర్‌ఓ నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అవశేషాలను దహనం చేయకండి..

- అలా చేస్తే సమస్యలు ఉత్పన్నం
- పశువులకు దాణాగా ఉపయోగించే అవకాశం
- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని అధికారుల సూచన



ఎం.విజయనిర్మల, ఖమ్మం డీఏఓ





వరి, పత్తి పంటల అవశేషాలను దహనం చేస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: పంట కోతలు పూర్తయ్యాక అవశేషాలను రైతులు దహనం చేస్తున్నారు. తద్వారా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గత యాసంగి సీజన్‌లో పండించిన పంటలకు సంబంధించి 4,587 ఎకరాల్లో సాగు చేసిన పంటల అవశేషాలను రైతులు దహనం చేసినట్లు ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటల అవశేషాలు ఉన్నట్లు ఆ శాఖ గుర్తించింది. అయితే, వీటిని దహనం చేయడం వల్ల సమస్యలు వస్తాయని, అలాకాకుండా పశువులకు దాణాగా ఉపయోగించే అవకాశమున్నందున దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల సూచించారు. ఈమేరకు ఆమె వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

అవశేషాలు కాల్చడానికి కారణాలు

రైతులు పంట కోసి, మరో పంట వేయడానికి మధ్యలో సమయం తక్కువగా ఉండడంతో త్వరగా అవశేషాలను తొలగించడానికి దహనం చేయడాన్ని సులభమైన మార్గంగా ఎంచుకుంటున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటల అవశేషాలు కుళ్లడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టడంతో కాల్చడమే మేలని భావిస్తున్నారు. ఒకవేళ పంట అవశేషాలను తొలగించకుండా వదిలేస్తే చెదపురుగులు, తెల్లదోమ వ్యాప్తి పెరుగుతుంది. పత్తిపంటలో గులాబీ రంగు పురుగు, కాయ తొలుచు పురుగు వ్యాప్తి చెంది ఆతర్వాత పంటల దిగుబడి పడిపోతుంది.

కాలిస్తే ఎదురయ్యే సమస్యలు..

పంట అవశేషాల సేకరణ, దహనం పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తుంది. ముఖ్యంగా కర్బన సమ్మేళనాల వంటి ప్రమాదకర వాయువులు, గ్రీన్ హౌస్ వంటి వాయువులను విడుదల చేస్తాయి. ఇప్పటికే ఉన్న వాయు కాలుష్యానికి ఇది తోడై గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులకు దారితీస్తుంది. అలాగే, పంట అవశేషాలు కాల్చడం వలన వాతావరణంలోకి కార్బన్ మోనాక్సైడ్ విడుదలై దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయి. ప్రజలకు వాయు కాలుష్యం, రవాణాలో అంతరాయం, శ్వాస కోశ సమస్యలు చోటు చేసుకుంటాయి. పంట అవశేషాలు కాల్చడం వలన విలువైన నేల సేంద్రియ పదార్థాలు, పోషక పదార్థాలు కోల్పోవడం, నేల నిస్సారంగా మారుతుంది. నేలలో ఉన్న నత్రజని, కార్బన్ స్థాయిని తగ్గిస్తుంది. దీర్ఘకాలంలో పంట ఉత్పాదకతపై ప్రభావం పడుతుంది. దహనం వలన ఉత్పన్నమయ్యే వేడి మట్టిలో ఉండే ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, పర్యావరణ అనుకూల కీటకాలు నశించిపోతాయి.

మరేం చేయాలి...

పంటల అవశేషాలను తగలబెట్టకుండా వదిలేస్తే నత్రజని, కార్బన్, ఫాస్పరస్ వంటి పోషకాలను నేలకు అందిస్తాయి. నేలలో సేంద్రియ కార్బన్, నీటి నిల్వ సామర్థ్యం మెరుగవుతుంది. సూక్ష్మజీవులు, సేంద్రియ పదార్థ ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. నేలలో సేంద్రియ పదార్థాన్ని అధికం చేస్తుంది. కుళ్లిన తరువాత నేల సారం కావడాన్ని మెరుగుపరుస్తుంది. జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటల అవశేషాలను పశువుల మేతగా కూడా ఉపయోగించే అవకాశముంది. అలాగే, మొక్కజొన్న అవశేషాలు మట్టిలో కలపవచ్చు. ఇది పోషకాలను ఆదా చేయడమే కాక కాల్చడం ద్వారా ఎదురయ్యే కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ద్వారా 'పిల్లల కోసం'

ఖమ్మం స్పోర్ట్స్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరింత రాణించేలా తీర్చిదిద్దేందుకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ద్వారా 'పిల్లల కోసం'పేరిట శిక్షణ ఇప్పించనున్నట్లు కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ డీ.టీ.చారి తెలిపారు. ఖమ్మంలో ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం నుంచే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు విభిన్న మనస్తత్వం కలిగి ఉంటారని, వారికి ఇష్టం లేని సబ్జెక్టుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈమేరకు వీరిని సరైన మార్గంలో పెట్టేందుకు 'పిల్లల కోసం'కార్యక్రమాన్ని అమలుచేయనున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ.జకీరుల్లా, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వలంటీర్లు శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రమాసత్యవతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జాన్‌మిల్టన్, పి.సర్వేశ్వరరావు, జి.రోమిల, అభిజిత్‌విశ్వాస్, అస్రా, ఫాతిమా, కిరణ్, శ్యాప్రసాద్, కబీర్, గణేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.